# యాక్సిడెంట్

**- డా. రాగతి రమ**



ఉగాది పోటీలో ఎంపికైన కథ

"మనం అల్లాటప్పాగాడి పెళ్ళికి కాదు, ఎమ్.ఎల్.ఏ కమలాకరంగారి కుమార్తె పెళ్ళికి వెళ్తున్నాం అది గుర్తుంచుకొని, కారుని ఎక్కడబడితే అక్కడే ఆపకుండా తీసుకెళ్ళు..." అన్నాను ఓరగా అమర్‌నాథ్‌ని చూస్తూ.

"మనం మనుష్యులం- అలాగే ప్రవర్తించాలి. అది నువ్వు గుర్తుంచుకో-" అన్నాడు అమర్‌నాథ్ చిన్నగా నవ్వుతూ.

ఆ మాటకే కాదు ఆ నవ్వు చూసి కూడా నాకు మండుకొచ్చింది. నాకంటే చిన్నవాడైతే తీసిపెట్టి లెంపకాయ ఇచ్చి వుండేవాణ్ణేమో. కానీ-

"అబ్బ! నీలాంటి వాడిని నేనెక్కడా చూళ్ళేదు. ఎవడూ పట్టించుకోకపోయినా అన్నీ నీకు కావాలంటావ్. అందరికీ సాయం చేస్తానంటావ్! కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు చెప్పు? ఎవడు ఎలా పోతే నీకేమిటంట? ఎవడికో కోన్ కిస్కాగాడికి ఏదో జరిగితే మధ్యన నీకేమిటంట? అయినవాళ్ళని కాని వాళ్ళని నెత్తిన పెట్టుకోవాలని చూస్తావు... దానివల్ల నీకు ఒరిగేదేమిటి? జేబు ఖాళీ... ఎనర్జీ వేస్ట్... నీ రూట్ మార్చుకో అమర్‌నాథ్-" అన్నాను. ఈ డైలాగ్ చెప్పి చెప్పి నాలుక అరిగిపోయింది. కానీ ఈ మహానుభావుడు మాత్రం ఒక చూపు, ఒక చిరునవ్వు పారేసి నిమ్మకు నీరెత్తినట్లు, చెవిటివాడి ముందు శంఖం వూదినట్లు వూరుకుంటాడు. ఆమాటకొస్తే ఎప్పుడూ చిరునవ్వే రువ్వుతాడు, ఎప్పుడూ తెల్లని దుస్తులే ధరిస్తాడు, ఎప్పుడూ గొప్పా, బీదా తేడా లేకుండా అందరితోనూ మాట్లాడతాడు, ఎప్పుడు ఆపద ఎక్కడుంటే అక్కడుంటాను అంటాడు.

ఆపదలో వున్నవాళ్ళకి అప్పులిచ్చి చెయ్యి కాల్చుకున్నాడు. వసూలు చేసుకునే చమత్కారం లేదు. అందుకే అతని భార్య నా దగ్గిర గోల చేస్తుంది- "ఏం చెయ్యమంటారన్నయ్యా... గోడకు కొట్టిన బంతే అనుకో ఎంత చెప్పినా వినిపించుకోరు. మన మాట మనదే- తన బాట తనదే! మా ఇద్దరమ్మాయిలు ఇంటర్ చదువుతున్నారు. ఇద్దర్నీ ఇంజనీర్లు చేయాలి; పెళ్ళిళ్ళు చేయాలి; పేరంటాలు చేయాలి; మరో ప్రక్క రోడ్డు మీద ఏ యాక్సిడెంటు జరిగినా వాళ్ళని తన కారులో ఎక్కించుకొని ఆస్పత్రికి తీసుకెళ్తే గానీ వూరుకోరు. ఈయనతో ఎలా చచ్చేది...?"

'అవును నిజమే'అని నేను అంటే- ఆవిడ మళ్ళీ అంటుంది-

"మనకేదన్నా ఆపద దాపరిస్తే వాళ్ళేమన్నా తీరుస్తారా... తీరుస్తారా? లోకం అంతా స్వార్థంతోనే వుంది. అలాంటప్పుడు మనకెందుకు ఇంకొకళ్ళ వూసు."

"వీడిని మార్చడం నావల్ల కాదమ్మా" అన్నాను. అయినా చెవులో జోరీగ లాగ నావంతు ప్రయత్నం నేను చేస్తునే వున్నాను. ఆవిడ ఏడిచో, మొత్తుకునో, అరిచో, గోల చేసో ఆవిడ ప్రయత్నం ఆవిడ చేస్తూనే వుంది. అమర్‌నాథ్ మాత్రం బౌద్ధ భిక్షువులా తల వంచుకొని తన పని తాను చేసుకుపోతునే వున్నాడు.

అమర్‌నాథ్, నేను చిన్నప్పటి స్నేహితులం. నేను కంట్రాక్టర్‌గా అవతారమెత్తి లంచాలు మేపి, లంచాలు మేసి లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకుంటే, అమర్‌నాథ్ ఆఫీసరు అయితే అయాడు గానీ లక్ష్మీదేవిని దొరకపుచ్చుకునే ప్రయత్నం చేయలేదు.

అక్కడికీ నేను అంటునే వుంటాను- "అమర్ మనిషన్నవాడికి లంచం, కంచం, మంచం అవసరం రా" అని.

ఒప్పుకున్నట్లుగానే తలూపుతాడు ఏమిటో మనిషి?

సాంట్రో కారు చీకటిని ముద్దుపెట్టుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. డ్రైవ్ చేస్తున్నాడు అమర్‌నాథ్.

వాడి పనులు నాకే కాదు నా పనులు వాడికీ నచ్చవని నాకు తెలుసు.

అయినా మా స్నేహం వసంత రుతువు నాటి పూల తోటలా కళకళలాడుతూ వుంది. దానికి కారణం అమర్‌నాథే.

తల తిప్పి అమర్‌నాథ్‌ని చూసాను. దీక్షగా రోడ్డుని చూస్తున్నాడు.

అక్కడక్కడ బిక్కుబిక్కుమంటూ రోడ్డు మీద వీధి దీపాలు.

చలికి వణికిపోతున్నట్లు అటూ ఇటూ చెట్లు హోరెత్తిస్తున్నాయి. అమర్‌నాథ్ మంచివాడు చాలా చాలా మంచివాడు. ఈనాటి స్వార్థ ప్రపంచంలో ఆ మంచితనం ఎందుకు అన్నదే నా ప్రశ్న...?

అమర్‌నాథ్ మంచితనం అంటే నాకో సంఘటన గుర్తుకొస్తుంది.

మేం టెన్త్‌క్లాస్‌లో వున్నప్పుడు మమ్మల్ని అరకులోయ టూర్‌కి తీసుకెళ్ళారు.

కిరణ్ అని మా క్లాస్‌మేట్ మహా పొగరుబోతు వుండేవాడు. ఒకమ్మాయిని ఏడిపించాడని అదేమని నిలదీసినందుకు అమర్‌నాథ్‌ని చెంప పగలగొట్టాడు కిరణ్. మాష్టర్లకి కూడా భయమే కిరణ్ అంటే. మాష్టర్లకి ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. అదీగాక కిరణ్ తండ్రి గొప్ప లాయర్. ఏదైనా కేసులో ఇరికించేయాలి అంటే ఇరికించేస్తాడు అని భయపడే వారు మాష్టర్లు. మూడురోజుల టూర్‌కని అరకు తీసుకువెళ్ళారు. కిరణ్‌కి తెల్లారేసరికి విపరీతమైన జ్వరం వచ్చింది. మందులు వేసినా జ్వరం తగ్గలేదు. మధ్యాహ్నానికి ఇంకా ఎక్కువైంది. మాష్టారు కంగారు పడితే మేం తిరుగు ప్రయాణం తప్పదనుకున్నాం. కానీ నేనున్నానంటూ ముందుకు వచ్చాడు అమర్‌నాథ్- కిరణ్‌ని తీసుకొని ఒక్కడు విశాఖ బయలుదేరి వెళ్ళిపోయాడు. ముందు హాస్పటల్‌కి తీసుకువెళ్ళి చెకప్ చేయించి, మందులు రాయించి, కొని, వేసి అప్పుడు ఇంట్లో దిగబెట్టాడు. అందరి ప్రశంసలూ పొందాడు. నాలాంటి వాడైతే కిరణ్‌ని జన్మంతా శత్రువుగానే చూసును.

ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి.

"కొంపదీసి వర్షం పడదు కదా!"అన్నాను.

"పడుతుందని రేడియోలో చెప్పారు" అన్నాడు.

ఛీఛీ వర్షం పడితే అంతా గలీజు, కంపు, ఈ రోడ్లు చూసావుగా అంతా మునిగిపోతాయి అన్నాను.

"ఎందుకలా చిరాకు పడతావు. వర్షం పడితే భూమాత దాహం తీరుతుంది" అన్నాడు.

"భూమాత గురించి తర్వాత ముందు నీ గురించి ఆలోచించు" అన్నాను.

'నా గురించా...? పాత పాట పాడకు" అన్నాడు.

నీకు తెలీని పాత పాట- సమయం, డబ్బు అపురూపమైనవి వాటిని జాగ్రత్తగా ఖర్చుపెట్టకపోతే తర్వాత విచారించి లాభం లేదు. తిరిగి వాటిని పొందలేం!" అన్నాను.

పకపక నవ్వాడు.

"దడిపిస్తున్నావా?" అన్నాడు.

"నీ భార్యా పిల్లల గురించి ఆలోచించు."

ఆశ్చర్యంగా చూసి- "వాళ్లకేం తక్కువ చేసాను?" అన్నాడు.

నేను చెబుదామనుకున్నంతలో- కారు సడన్ బ్రేకుతో ఆగింది. కారుకి అడ్డంగా జనాలు గుంపుగూడి వున్నారు. ఆత్రుతగా అమర్‌నాథ్, చిరాగ్గా నేనూ కారు దిగాం. గుంపును తోసుకొని లోపలికి వెళ్తే- నెత్తుటి ముద్దలా పడి వున్నాడో మనిషి. ప్రక్కన సైకిల్ నుజ్జునుజ్జు అయి వుంది. ఏదో వాహనం గుద్దేసి చడీచప్పుడు లేకుండా దౌడుతీసి వుంటుంది.

"ఎవరితను...?" అడిగాను ఒకతన్ని.

పాలుపోసే పాపయ్యండి. అన్నాడతను.

"అయ్యో రేపటినుండి పాలకి అవస్తే" అన్నాడు ఇంకొకడు.

అక్కడంతా చిక్కని చీకటి చప్పుడు చేయకుండా వుంది. అక్కడక్కడ బడ్డీ కొట్లు దీపం బుడ్డి వెలుగులో. అక్కడక్కడ పెంకుటిళ్ళు జారవిడిచినట్లు- మగత కమ్మేసినట్లు తూలుతూ వున్నాయి అక్కడక్కడ పూరి గుడిసెలు. ఇతన్ని వెంటనే హాస్పటల్‌కి తీసుకువెళ్ళాలి. సాయం పట్టండి, నా కారులో పడుకోబెడదాం- అమర్‌నాథ్ కంఠం వినిపించగానే ఇటు తిరిగి చూసాను. అమర్‌నాథ్, మరో ఇద్దరు పాలవాణ్ని ఎత్తి కారు వెనక సీట్లో పడుకోబెట్టారు. అదే సమయంలో శోకాలు పెడుతూ అతని భార్య వచ్చింది. - "బాబూ పేనం కాపాడండి బాబూ- నా చర్మంతో సెప్పులు కుట్టిత్తా" అది అమర్‌నాథ్ కాళ్ళకు చుట్టుకుపోయింది.

"కారెక్కమ్మా, మనం హాస్పటల్‌కు వెళ్తున్నాం" అన్నాడు అమర్‌నాథ్.

పాలవాడి ప్రక్కన కూర్చుంది భార్య వెక్కిళ్ళు నాకు చీదరంగా అనిపిస్తున్నాయి.

పాల వాడి మూలుగు, కేకలు నాలో రౌద్ర రసాన్ని నింపుతున్నాయి.

మరో అరగంటలో విజయనగరం చేరుకుంటాం. కానీ విశాఖపట్నం వేపు బయలుదేరింది కారు.

నా కళ్ళముందు ఎంఎల్ఏ కమలాకరం- విందు పార్టీ- మందు పార్టీ మెదులుతున్నాయి.

ఎంఎల్ఏగారు ముందే నాకు ఫోనుచేసి చెప్పడంవల్ల విందులో ఏం ఏం వుంటాయో నాకు తెలిసిపోయింది- చికెన్ బిర్యానీ, రొయ్యల పులావు, ఒంజిరం ఇగురు, కైమాకూర, రొయ్యల రోష్టు, చేపల వేపుడు, మాంసం వేపుడు స్రొర పిడుగు, పీతల కూర, వులవ చారు, మజ్జిగ పులుసు, చింతకూర పప్పు నోరు వూరిపోతోంది. ఎప్పుడా ఎప్పుడా తినడం అని ఆత్రుతగా వుంది నాకు. విందును కడుపారా లాగిద్దామని మధ్యాహ్నం భోజనం తక్కువే తీసుకున్నా. సాయంత్రం టీ మాత్రం తీసుకున్నా. ఇప్పుడు చూస్తే ఇలాగైంది. కారు స్పీడుగా వెళ్తా వుంది. గాలి రయ్యిమని వీస్తూ వుంది. తుంపరలు బిగిన్ అయ్యాలు. నా మనసు మండిపోతూ వుంది. గొప్ప హీరోననుకుంటున్నట్టున్నాడు ఈయనగారు- హీరో... పనికిమాలిన హీరో...

అరగంటలో కారు హాస్పటల్ ముందు ఆగింది. హాస్పటల్ సిబ్బంది పాల వాణ్ని లోపలికి తీసుకెళ్ళడం జరిగింది.

"ఇంకేం అయిందిగా పద" అన్నాను.



బుర్ర వేడెక్కిపోయి వుంది. హబ్బ- ఈ వర్షం వద్దు- ఈ హోరుగాలి వద్దు- ఈ చీకటి ముద్ద వద్దు- ఈ యాక్సిడెంట్లు- ఈ వేడికోడాలు వద్దు- ఈ విందులు- వినోదాలు వద్దు- ఛత్ వెధవ బ్రతుకు సుఖంగా బ్రతుకుదామన్నా బ్రతకనివ్వరు.

"ఇంకా చాలా వుంది. డాక్టర్‌తో మాట్లాడాలి. ఇంకా టైం పట్టొచ్చు. నా కారు తీసుకొని నువ్వెళ్ళు" అన్నాడు.

"నువ్వు రావా...?"

"వీలైతే టాక్సీలో వస్తాను. నా కారులో నువ్వెళ్ళు."

"నేనే టాక్సీలో పోతాను. నువ్వు రాలేవని నాకు తెలుసు." నేను రోషంగా బైటకి నడిచాను. పది నిమిషాల్లో టాక్సీలో వున్నాను.

కొంచెం స్పీడుగా వెళ్ళనివ్వు ఎంఎల్ఏగారి కూతురి పెళ్ళి మిస్సవకూడదు." అన్నాను.

"మరి డిన్నర్ సార్" అన్నాడు.

అది అన్నిటికంటే ముఖ్యమైనది అన్నాను.

"అబ్బో అంత గొప్పదా?" అన్నాడు.

"చాలా."

"ఏమేమి ఐటమ్స్ వుంటాయిసార్...?"

నాలో ఉత్సాహం పురకలు వేస్తోంది. చికెన్ బిర్యానీ, రొయ్యల పులావు నేను లిస్ట్ చదవగానే-

"అయ్యబాబోయ్" అన్నాడు టాక్సీ వాడు.

టైం చూసా- పావుతక్కువ తొమ్మిది. గుండె గుభేల్ మంది.

"ఇంకొంచెం స్పీడుగా" అన్నాను.

"అలాగే సార్ యమస్పీడుగా పోనిస్తాగా" అన్నాడు టాక్సీవాడు.

మేఘాలతో పోటీపడినట్లుగా వెళ్తోంది టాక్సీ.

రాజకీయ నాయకులతో పరిచయం వైకుంఠపాళిలో నిచ్చెనలు.

ఎలాగోలా ఎగబ్రాకి గొప్ప అవతారం ఎత్తి సంచుల నిండా డబ్బుతో కుబేరులమై పోవచ్చు. ఈ అమర్‌నాథ్‌కి బుర్ర తక్కువ బంగారు అవకాశం చేజేతులా వదులుకుంటాడు. ఏం చేస్తాం ఎవరి ఖర్మకు ఎవరు కర్తలు...?

వర్షం పెద్దదైంది. విండో మూయాలనిపించలా.

ఈ గాలిలో- చలిలో- వర్షంలో- విందు- మందు. జీవితానికి అంతకన్నా ఏం కావాలి...?

ఇంకొంచెం వేగం అన్నాను.

"అలాగే సార్" అన్నాడు టాక్సీ వాడు.

"చిటపట చినుకులు పడుతూ వుంటే టాక్సీవాడు పాట అందుకున్నాడు. విమానంలా దూసుకెళ్తొంది టాక్సీ. ఒక్క జర్క్‌తో విమానం ఆగిపోయింది. సీటులో అంతెత్తున ఎగిరిపడ్డాను.

చీకట్లో- వర్షంలో- రోడ్డుమీద ఒకతను పడిపోయి వున్నాడు. రక్తం- ప్రక్కన ఒరిగిపోయివున్న మోటారు సైకిల్. యాక్సిడెంట్! తల తిప్పి చూస్తే విండో దగ్గిర పదిహేనేళ్ళ కుర్రాడు ఏడుస్తూ అడుగుతున్నాడు-

"ఏమండీ- మా డాడీని కాపాడండీ. మీకు పుణ్యం వుంటాదండీ...! ప్లీజండీ..."

వరదలో- వాగులో- దీనంగా- అతి దీనంగా- మంచు ముక్క కరిగిపోతున్నట్లుగా - కుమిలిపోతూ- అడుగుతున్నాడు-

"మీకు దణ్ణం పెడతాను- మీరు చేసిన మేలు జన్మజన్మలకూ మరిచిపోనండీ-" వెక్కిళ్ళతో అడుగుతున్నాడు.

చీకట్లో రూపం సరిగ్గా తెలీడం లేదు.

"ఏమంటారు సార్-?" అడిగాడు టాక్సీవాడు.

బుర్ర వేడెక్కిపోయి వుంది. హబ్బ- ఈ వర్షం వద్దు- ఈ హోరుగాలి వద్దు- ఈ చీకటి ముద్ద వద్దు- ఈ యాక్సిడెంట్లు- ఈ వేడికోడాలు వద్దు- ఈ విందులు- వినోదాలు వద్దు- ఛత్ వెధవ బ్రతుకు సుఖంగా బ్రతుకుదామన్నా బ్రతకనివ్వరు.

"పోనివ్వు" అన్నాను.

టాక్సీ రివ్వున దూసుకుపోయింది.

"ఇంకొంచెం వేగంగా వెళ్ళు" అన్నాను.

నా బండి రాకెట్ సార్. టాక్సీ రాకెట్‌లా దూసుకెళ్తా వుంది. ఆ కుర్రాడి ఏడుపు నాలో ఏదో ఆవేదనను కలిగిస్తూ వుంది.

"ఇంకా స్పీడు కావాలి" అన్నాను.

"ఇదో ఇంకో పావుగంటలో ఎంఎల్ఏగారి బిల్డింగ్ ముందు వుంటాం" సార్ అన్నాడు.

"పావుగంటా అబ్బా- లాభం లేదు- ఇంకా తొందరగా వెళ్ళాలి- వెళ్ళు" అన్నాను. టాక్సీ యమ స్పీడుగా వెళ్తుంది. బైట మెరుపులు వురుములు కూడా తోడయాయి. చికాగ్గా వుంది. కళ్ళు మూసుకున్నాయి.

"ఇంకొంచెం వేగంగా వెళ్ళు."

అంతకంతకు వేగం పెరిగిపోతూ వుంది- వేగం వేగం వేగం.

ధడేల్ మంది. నేను కెవ్వుమన్నాను. డ్రైవర్ అరుపు కూడా కలిసిపోయింది. రాకెట్ చెట్టుకు గుద్దుకుంది. నేను ఎగిరి బైట పడ్డాను. ఏ చీకటిని, వర్షాన్ని అసహ్యించుకున్నానో ఆ మురికిలో అమ్మోరు శాపంలా వాన వరదలై పారుతోంది. చెయ్యి విరిగిపోయింది. బాధ- అంధకారం- బురద- వాన- పాక్కుంటూ రోడ్డుమీదకు వచ్చాను. టాక్సీవాడు ఏమైయాడో తెలీదు. బహుశా స్పృహతప్పి పడిపోయి వుండొచ్చు. అమర్‌నాథ్ లాంటి మహానుభావుడెవరైనా వచ్చి ఆదుకుంటాడేమోనని కళ్ళు ఇంత చేసుకొని చూస్తున్నాను ఆశగా.

ఇంతలో ఏదో కారు- నాలో ప్రాణం లేసొచ్చింది.

"హెల్ప్ హెల్ప్" అరిచాను. కారు వెళ్ళిపోయింది. దుఃఖం ముంచుకొచ్చింది. చిన్నప్పుడు మా మాష్టారు చెప్పిన పద్యం గుర్తొచ్చింది-

గంగి గోవుపాలు గరిటెడైనను చాలు.

కడవడైనను ఏమి ఖరము పాలు. అమర్‌నాథ్ గుర్తొస్తున్నాడు. ★